# అంబేద్కర్ దృశ్యరూపం ఆవిష్కృతం

**- నేటి నుంచి మే 17 వరకు రాష్ట్ర వ్యాప్త ప్రదర్శనలు**
**- ప్రజాశక్తితో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్‌బాబు**

**ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్**

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్), 'సంఘం శరణం గచ్ఛామి' నాటకంతో జ్ఞానయుద్ధానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 21 నుండి మే 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నాటక ప్రదర్శనలు జరగనున్నాయి. ప్రజాశక్తితో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ మాటలను గుర్తు చేశారు. 'చేతనైతే ముందుకు లాక్కు వెళ్లండి, కాకపోతే అక్కడే వదిలేయండి. వెనక్కు మాత్రం లాగకండి.' ఈ సూత్రమే తమ ప్రయత్నాలకు స్ఫూర్తి అని ఆయన అన్నారు. డాక్టర్ అంబేద్కర్ సామాజిక ఉద్యమం ప్రాముఖ్యతను వివరిస్తూ, దానిని నడిపే వారికి ఉండవలసిన లక్ష్యాలను స్పష్టం చేశారు. "నేను నడిచిన దారిలో రాళ్లు, ముల్లులు ఎన్నో ఉన్నాయి. వాటిని ఒక్కొక్కటిగా తొలగిస్తూ, సామాజిక ఉద్యమ రథాన్ని ఇక్కడి వరకు తీసుకొచ్చాను. మీకు చేతనైతే దీనిని ముందుకు తీసుకెళ్లండి. లేదంటే ఇక్కడే ఉంచండి. కానీ దయచేసి వెనక్కి లాగకండి,' అని ఆయన ఉద్బోధించారు. ప్రతి సామాజిక ఉద్యమకారుడు ఈ మాటలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ఇటీవల డాక్టర్ బాబాసాహెబ్ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ 134వ జయంతి ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నాం. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాల్సిన వేడుకలు నిలిచిపోయినా, కర్నూలు జిల్లా వ్యాప్తంగా గతంలో కంటే ఎక్కువ సంబరాలు జరిగాయి. యువత ఉత్సాహంగా సామాజిక పరివర్తకుని జన్మదినాన్ని కొనియాడారు. జై భీమ్ నినాదాలతో వీధులు మారుమోగాయి. కేకులు కట్ చేశారు. బాణాసంచా కాల్చారు. డిజె పాటలకు నృత్యాలు చేశారు. అంబేద్కర్ చిత్రపటాలను ఊరంతా ఊరేగించారు. ఈ ఉత్సాహం సామాజిక ఉద్యమానికి సంతృప్తినిచ్చినా, కేవలం ఉత్సవాలకే పరిమితమైతే ఆశయం వెనుకబడిపోతుందనే భయం కూడా ఉంది. ఎందుకంటే, జయంతి వేడుకల్లో పాల్గొన్న వంద మందిలో డిసెంబర్ 6న జరిగే వర్ధంతిని ఎంతమంది గుర్తు చేసుకుంటారు? సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే జయంతి, వర్ధంతి జరిపి, ఆ తర్వాత సామాజిక ఉద్యమం గురించి పట్టించుకోని వారు ఎందరో ఉన్నారు. ఇవన్నీ ఉద్యమాన్ని వెనక్కి లాగేస్తాయి. అందుకే డాక్టర్ బిఆర్. అంబేద్కరును చదివితే సరిపోదు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలి. కుల, మత భేదాలు లేకుండా సమానత్వాన్ని సాధించాలి. ఆయన కలలుగన్న కుల నిర్మూలన కోసం నిబద్ధతతో కృషి చేయాలి. భారతదేశంలో కులం ఒక మర్రిచెట్టు వేళ్లలా బలమైనది, సంక్లిష్టమైనది, లోతుగా పాతుకుపోయింది. దానిని ఒక్కసారిగా పెకలించడం అంత సులభం కాదు. సామాజిక తరగతుల ఆత్మగౌరవం, ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధిస్తే కుల నిర్మూలన అసాధ్యం కాదు. నేటికీ సమాన అవకాశాలు ఇవ్వలేని పాలకుల కుట్రను అర్థం చేసుకోలేని కొందరు బలహీనులపై దౌర్జన్యం చేయడమే కాకుండా, వారికి అండగా నిలిచిన బాబాసాహెబ్ విగ్రహాలపై కూడా దాడులు చేస్తున్నారు. నిజానికి, భారతదేశంలోని నిచ్చెనమెట్ల వంటి అసమానతలతో కూడిన వేల కులాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అనే నాలుగు తరగతులుగా విభజించి, వారి పని, ఆహారం, సమాజంలో వారికి లభించే గౌరవం ఆధారంగా ఏ వర్గంలో ఉంచాలో నిర్ణయించే బాధ్యతను పాలకులకు అప్పగించిన గొప్ప వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్. ఓటు హక్కు, రిజర్వ్ బ్యాంక్ వ్యవస్థ, కేంద్ర రాష్ట్ర పాలన, మహిళా హక్కులు, కార్మిక హక్కులు ఇలా చెప్పుకుంటూ పోతే సమాజం మొత్తానికి ఉపయోగపడే అనేక హక్కులను వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆ మహనీయుని ఆశయం నేడు ప్రజాస్వామ్య దేశంలో అవహేళనకు గురవుతోంది. రాజ్యాంగ రూపకల్పన అనంతరం ఒక బ్రిటిష్ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు అంబేద్కర్ సమాధానమిస్తూ, ప్రజాస్వామ్యం విఫలమైతే, రాజ్యం మత రంగు పులుముకుని, మెజారిటీ పేరుతో ప్రజలను మోసగించి, వారిపై దారుణమైన భారాలు, దాడులు పెంచుతుంది. అలాంటి పరిస్థితుల్లో కమ్యూనిజం మాత్రమే పరిష్కారం చూపుతుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే, కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ, వారి జీవించే హక్కును కూడా హరిస్తూ, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సమయంలోనే బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుగన్న కుల నిర్మూలన లక్ష్యాన్ని భుజాన వేసుకున్న కెవిపిఎస్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సహకారంతో 'సంఘం శరణం గచ్ఛామి' అనే నాటకం ద్వారా అంబేద్కర్ జీవితాన్ని మరోసారి ప్రజల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఈనెల 21న కర్నూలు జిల్లాలో ప్రారంభమయ్యే ఈ జ్ఞాన యుద్ధమే 17న విజయవాడలో ముగుస్తుంది. ఈ ప్రదర్శనలు పెద్దకడబూరు (ఏప్రిల్ 21), ఉల్చాల గ్రామం, కర్నూలు మండలం (ఏప్రిల్ 22), మాధవరం గ్రామం, మంత్రాలయం మండలం (ఏప్రిల్ 23), ఎమ్మిగనూరు టౌన్ (ఏప్రిల్ 24), ఏనుగుబాల గ్రామం, ఎమ్మిగనూరు మండలం (ఏప్రిల్ 25), కర్నూలు సునయన ఆడిటోరియం (ఏప్రిల్ 26), పాములపాడు (ఏప్రిల్ 27), నందికొట్కూరు (ఏప్రిల్ 28) అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల మీదుగా సాగి మే 17న విజయవాడలో ముగుస్తాయి.

## వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాల్సిందే

**- ముస్లిం జెఎసి హెచ్చరిక**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు కర్నూలు నగరంలో జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌక్ బజార్ , వెంకయ్యపల్లి ఇందిరమ్మ కాలనీలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. వెంకయ్యపల్లిలో స్థానిక నాయకుడు మహిముద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్, చౌక్ బజార్ వద్ద జరిగిన కార్యక్రమానికి యినయతుల్ల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు పి. ఇక్బాల్ హుస్సేన్ (ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు), ఎస్. ఎండి.షరీఫ్ (ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి), ఆఫీజ్ అప్రోజ్, జమాతే ఇస్లాం ఏ హింద్ నాయకులు పిఎస్. మునీర్ అహ్మద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ నిసార్ అహ్మద్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు డి. అబ్దుల్ దేశాయ్, సిఐటియు నగర కార్యదర్శి మారెళ్ళ రామాంజనేయులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ సూచనల మేరకు ఈ బిల్లును ప్రవేశపెట్టి, తమ మెజారిటీ బలంతో ఆమోదింప చేసుకుందని విమర్శించారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం (నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్) ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా ఈ బిల్లును వెనక్కి తీసుకువచ్చేలా టిడిపి కూటమిపై ఒత్తిడి తేవాలని కోరారు. అలా చేయని పక్షంలో గతంలో టిడిపి పట్టిన గతే మళ్లీ ఎదురవుతుందని హెచ్చరించారు. పెద్ద పెద్ద వ్యాపారవేత్తలకు, ఆర్‌ఎస్‌ఎస్ అనుయాయులకు వక్ఫ్ భూములను కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఈ బిల్లును తీసుకొచ్చారని విమర్శించారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య, డాలర్ విలువ పెరిగి రూపాయి పడిపోవడం, డిజిపి క్షీణత వంటి సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి హిందూ-ముస్లిం-క్రైస్తవుల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. మసీదులు, చర్చిలను కూల్చివేసి ప్రజల మధ్య తగాదాలు సృష్టిస్తున్నారని వారు దుయ్యబట్టారు. ఈ కుట్రలను ప్రజలందరూ తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదని అన్నారు. జెఎసి పిలుపు మేరకు రాబోయే కార్యక్రమాల్లో ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించాలని, ఈ బిల్లును వెనక్కి పంపేలా పోరాడాలని కోరారు. ఈ పోరాటానికి దేశ ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుల్ గఫూర్, జావీద్, షాషావలి, మహమ్మద్‌బాష, వాజిద్, వసీం, ఇర్ఫాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న ముస్లింలు

### పట్టణ నిరాశ్రయుల మహిళా గృహంలో నిత్యావసర సరుకుల పంపిణీ

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ చేసిన ఎంపి నాగరాజు, చంద్రబాబుకు బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరంలోని అశోక్‌నగర్ వద్ద ఉన్న పట్టణ నిరాశ్రయుల మహిళా గృహంలో నిత్యావసర సరుకులను ఎంపి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు 75 ఏళ్ల వయసులో కూడా నవ యువకుడిలా పని చేస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్దే చంద్రబాబు ధ్యాస, శ్వాస, ఆశ అని అన్నారు.. ఇక నిరాశ్రయుల గృహంలో ప్రతి రోజు భోజనం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎం.పి.. పేద ప్రజలను ధనికులను చేసేందుకు పీ ఫోర్ పాలసీని తీసు కొచ్చారన్నారు. అంతకుముందు ఎంపీ కార్యాలయంలో కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి అరుణ కుమారి, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకట రాముడు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబును చూసి ఎంతో నేర్చుకోవాలి

**- రాష్ట్ర మంత్రి టి.జి భరత్**
**- చంద్రబాబు బర్త్ డే సందర్భంగా రక్తదానం చేసిన మంత్రి టిజి భరత్**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

రక్తదానం చేస్తున్న మంత్రి టిజి.భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును చూసి తాను ఎంతో నేర్చుకోవాల్సి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. సిఎం చంద్రబాబు బర్త్ డే సందర్భంగా కర్నూల్లోని అక్షయ బ్లడ్ బ్యాంకులో మంత్రి టిజి భరత్ రక్తదానం చేశారు. అంతకుముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నాయకులందరూ కలిసి కేక్ కట్ చేశారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు బర్త్‌డే సందర్భంగా బ్లడ్ డొనేట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తాను ఆయన మంత్రివర్గంలో ఉంటూ పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై ఆయన ఆలోచన విధానం ఎంతో గొప్పదన్నారు. కంటిన్యూగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఆంధ్రప్రదేశ్.. దుబాయ్, సింగపూర్ మాదిరిగా అభివృద్ధి చెంది ఉండేదన్నారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఎనిమిదిన్నర లక్షల కోట్ల పెట్టుబడులు కేవలం సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే రాష్ట్రానికి వచ్చాయని మంత్రి చెప్పారు. ఇక సాక్షి పేపర్లో తమపై ఇష్టానుసారంగా వార్తలు రాస్తున్నారని.. ఇలాంటి రాతలను రాస్తే తాను చూస్తూ ఊరుకోనని, క్రిమినల్ డిఫమేషన్ కేసు వేస్తానని మంత్రి అన్నారు. తనకు కోర్టులపై పూర్తి నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రితో పాటు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పలువురు నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్, హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీ ఖాన్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర నాయకులు ఆకెపోగు ప్రభాకర్, సోమిశెట్టి నవీన్, కార్పొరేటర్లు కురువ పరమేష్, కైప పద్మలతా రెడ్డి, సీనియర్ నాయకులు రామాంజనేయులు, గున్నామార్క్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి. నాయకులు కెఇ.ప్రభాకర్, అరుణ కుమారి, అశోక్ కుమార్, కెవి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## డిఎస్‌సి పరీక్షకు 60 నుంచి 90 రోజులివ్వాలి

**- జిల్లా అభ్యర్థులంతా ఒకే పేపర్ రాసేలా చర్యలు : డివైఎఫ్‌ఐ**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

రాష్ట్ర ప్రభుత్వం 16,347 ఉద్యోగాలకు అనేక ఉద్యమాలు పోరాటాల ఫలితంగా ఆదివారం నోటిఫికేషన్ ఇవ్వడాన్ని డివైఎఫ్‌ఐ జిల్లా కమిటీగా స్వాగతిస్తున్నామని డివైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్ కర్నూలు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. నోటిఫికేషన్ లో ఉన్న అభ్యంతరాలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా డిఎస్‌సి అనగానే రెండవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్న అన్ని పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాల్సి ఉంటుందని, చాలా ఎక్కువ సిలబస్‌తో కూడుకున్నదని, ఎంత బాగా చదివిన వారైనా ఒక్కసారైనా పూర్తిస్థాయిలో రివిజన్ చేయాలి అంటే కనీసం 60 నుండి 90 రోజులు సమయం పడుతుందని తెలిపారు. ప్రభుత్వం పది నెలల నుండి నానబెట్టి కనీసం ప్రిఫర్ అయ్యే సమయాన్ని ఇవ్వకుండా పరీక్ష నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 2018 డిఎస్‌సి పరీక్షల్లో బాగా చదివిన వారికి కాకుండా కేవలం రెండు రోజులు పరీక్ష రాసిన వారికి మాత్రమే 80 శాతం ఉద్యోగాలు వచ్చాయన్నారు. దీనికి ప్రధానమైన కారణం డిఎస్‌సి పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించి నార్మలైజేషన్ చేయడమే అని తెలిపారు. అభ్యర్థులకు ఎవరికి అన్యాయం జరగకుండా ఉండాలంటే డిఎస్‌సి జిల్లా యూనిట్‌గా జరుగుతున్నందున ప్రతి జిల్లాకు ఒక రోజును కేటాయించి జిల్లాలోని అభ్యర్థులందరూ ఒకే పరీక్ష పేపర్ రాసే లాగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత నోటిఫికేషన్ విడుదల సందర్భంగా అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ఈ నోటిఫికేషన్ లో దానిపైన పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో అనేకమంది నిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందులు నోటిఫికేషన్ వస్తుందన్న నమ్మకం లేకపోవడం నారా లోకేష్ స్వయానా ఎవరు ఇబ్బంది పడవద్దు నోటిఫికేషన్ తర్వాత కనీసం 90 రోజులు సమయం ఇస్తామని తెలిపారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న డిఎస్‌సి కోచింగ్ పూర్తి కావడానికి కూడా సమయం పడుతుందని, కాబట్టి ప్రభుత్వం డిఎస్‌సి పరీక్షల షెడ్యూల్ ను కనీసం 60 రోజుల నుండి 90 రోజుల కు పెంచాలన్నారు. అభ్యర్థులు ఎవరూ నష్టపోకుండా ఆఫ్ లైన్ పరీక్ష లేదా ఆన్‌లైన్ అయితే జిల్లా అభ్యర్థులంతా ఒకే పేపర్ రాసే లాగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అభ్యర్థులతో కలిసి ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

అష్టావధానంలో మాట్లాడుతున్న అవధాని ఆముదాల మురళి, వేదికపై పృచ్ఛకులు

## చంద్రబాబు పాలనాతీరుకు దర్పణం అవధానం

**ప్రజాశక్తి - కర్నూల్ కల్చరల్**

అవధానంలో చంద్రబాబు పాలన వర్ణిస్తూ కార్యక్రమం సాగింది. ఆయన పాలనా తీరు అమోఘం అంటూ అవధాని ఆముదాల మురళి ప్రసంగించారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టీజీవి కళాక్షేత్రంలో ఏడు రోజుల కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. చీకటి రోజులు తొలగి వెలుగు వచ్చిందన్న సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల కళారత్న అవార్డులు అందు కున్న పత్తి ఓబులయ్య, అవధాని కళారత్న మురళితో పాటు ఉగాది పురస్కార గ్రహీతలు, కందుకూరి అవార్డు గ్రహీతలతో పాటు అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొని కేక్ కట్ చేసి చంద్రబాబు జన్మదినాన్ని జరుపుకున్నారు. అనంతరం సాగిన అష్టావధానంలో దత్తపది మారేడు రాముడు, నిశిద్ధాక్షరి అవధానం సుధాకర్‌శర్మ, సమస్య ఎస్ఎస్ పటేల్ ,అప్రస్తుత ప్రసంగం ఇనాయతుల్లా, వర్ణన నీలిమ, ఆసువు చంద్రమౌళిని, న్యస్తాక్షరి మధుసూదనాచారి, నా పాట నీ నోట మహ్మద్ మియ్యా నిర్వహించారు. ఈ సందర్భంగా అవధాని ఆముదాల మురళి మాట్లా డుతూ కళా రత్న అవార్డు అందుకున్న సందర్భంగా తొలిసారి కర్నూలులో అష్టావధాన నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి వెంకట కవులు, కొప్పరపు సోదరులు, సివి సుబ్బన్న, పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు వంటి వారు ఎందరో అవధానానికి సృష్టికర్తలుగా ఉండిపోయా రన్నారు. చంద్రబాబు పరిపాలనతో సాహిత్యం కళా రంగం అభివృద్ధి చెందగల దని అన్నారు. యువఅవధాని హర్ష, కన్వీనర్స్ డి ఈశ్వరయ్య, సంఘ ఆంజనే యులు వాల్మీకి రాముడు జీవి శ్రీనివాసరెడ్డి, పి రాజారత్నం, యాగంటి ఈశ్వరప్ప పాల్గొన్నారు.

## ఎస్‌జిటిలకు పదోన్నతులు కల్పించాలి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

మోడల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలకు, ఎస్‌జిటిలకు పదోన్నతులు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి డిమాండ్ చేశారు. ఆదివారం డిఇఒ ఎస్ శామ్యూల్ పాల్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి మాట్లాడుతూ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల పదోన్నతులు సక్రమంగా జరగాలన్నారు. సీనియార్టిలిస్టు తయారీలో ఇబ్బందులు తొలగించాలన్నారు. 117 జీవోకు వ్యతిరేకంగా ఉన్న,ఒకటి నుంచి 10వ తరగతి గల పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలను తొలగించాలన్నారు. ప్రతి యుపిస్కూల్‌కు స్కూల్‌అసిస్టెంట్‌ను నియమించాలన్నారు. డిఇఒ సాను కూలంగా స్పందిస్తూ తప్పనిసరిగా తగు చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శి ఏటి తిమ్మన్న, నాయకులు బాలరాజు, మార్కు, లక్ష్మన్న, జనార్ధన్, రత్నమయ్య పాల్గొన్నారు.

## రాజవర్ధన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

**-కుటుంబానికి అండగా నిలుద్దాం -వర్ధంతి సభలో వక్తలు**
**-ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధం ఆవిష్కరణ**
**-3వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

రాజవర్ధన్‌రెడ్డి పేర ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రతి ఒక్కరూ మాజీ ఎంపిపి డి రాజవర్ధన్‌రెడ్డి ఆశయాలను కొనసాగించాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన 3వ వర్ధంతి సభను నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వర యాదవ్ సభకు అధ్యక్షత వహించారు. వర్ధంతిని పురస్కరించుకొని ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక అనుబంధాన్ని వారు ఆవిష్కరించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి మాట్లాడుతూ... రోజుకు 24 గంటలు ఉంటే అందులో అత్యధిక కాలాన్ని రాజారెడ్డి తనతో మాట్లాడేందుకు కేటాయించేవారని అన్నారు. మాటకు కట్టుబడి ఉండే మనిషి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. రాజకీయాల్లో అసూయ ద్వేషాలు సర్వసాధారణమని, కానీ నిస్వార్థం అతని నైజం అన్నారు. అందుకు కర్నూలు ఎంపి, కోడుమూరు ఎమ్మెల్యేలను గెలిపించడమే నిదర్శనం అన్నారు. రాజవర్ధన్‌రెడ్డికి మరణం లేదని ప్రజల గుండెల్లో బతికే ఉన్నారన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ తనను రాజకీయంలోకి ప్రవేశం కల్పించి వెన్నంటి నడిపించిన వ్యక్తి రాజవర్ధన్ రెడ్డి అని అన్నారు. తనకు ఎంపీ స్థానం ఇవ్వాలని ప్రత్యక్షంగా పార్టీ పెద్దలతో మాట్లాడి ఒప్పించారన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించింది కోడుమూరు నియోజకవర్గ నుంచే అని తెలిపారు. ఆ కుటుంబానికి రుణపడి ఉంటానన్నారు. ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు మాట్లాడుతూ.. రాజ వర్ధన్ బతికుంటే మాతోపాటు ఎమ్మెల్యేగా ఉండేవాడన్నారు. జిల్లా అభివృద్ధికి నిత్యం ఆలోచించేవాడు అన్నారు. ఎమ్మెల్యే గౌరీ చరిత రెడ్డి మాట్లాడుతూ అనతి కాలంలో మంచి నాయకుడిగా రాజవర్ధన్ గుర్తింపు పొందారున్నారు. ఏ సమస్య వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చే మనిషి తాను అన్నారు. చిన్న వయసులోనే విధి చిన్నచూపు చూసిందన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాజవర్ధన్ రెడ్డి సచ్చీలుడు, నిరాడంబరుడు అన్నారు. నన్ను ఎల్లవేళలా సొంత అన్నలా ఆదరించాడన్నారు. నేడు నేను అనుభవిస్తున్న ఈ పదవి ఆయన పెట్టిన భిక్షేనన్నారు. ఎమ్మెల్యే చేస్తానని కొడుకు ఇచ్చిన మాటను నెరవేర్చిన వ్యక్తి తండ్రి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఎన్నో త్యాగాలు చేసిన విష్ణువర్ధన్ రెడ్డికి ప్రభుత్వం ప్రోటోకాల్ లభించే సముచిత స్థానం కల్పించాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వహీద్ మాట్లాడుతూ ఆ కుటుంబంతో 20 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. రాజవర్ధన్‌రెడ్డి నిత్యం రైతుల గురించి ఆలోచించే వ్యక్తి అన్నారు. నమ్ముకున్న కార్యకర్తల కోసం 60 పదుల వయస్సులో నవ యువకుడిలా విష్ణువర్ధన్ రెడ్డి పోరాటం ఆదర్శనీయం అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పట్టువదలని మనిషి రాజవర్ధన్ రెడ్డి అన్నారు. మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ నవీన్ మాట్లాడుతూ నాయకుడు అన్నవాడు బలహీనుల పక్షాన నిలబడాలని వాడే నిజమైన నాయకుడని రాజ వర్ధన్ రెడ్డి చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. గూడూరు సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ కట్టె కాలేంతవరకు ప్రజలతో ఉంటానని కార్యకర్తల్లో గుండె ధైర్యం నింపిన నాయకుడు రాజవర్ధన్ అన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు హర్షద్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ఆనందాన్ని వెతుక్కున్న మహా మనిషి రాజవర్ధన్ రెడ్డి అన్నారు. టిడిపి యువ నాయకులు జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి పుట్టే వాడే నిజమైన నాయకుడని రాజవర్ధన్ రెడ్డి ప్రజల మనిషి అన్నారు. పంచలింగాల టిడిపి నాయకులు కృష్ణ యాదవ్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి స్పోక్స్ పర్సన్ అరుణ, టిడిపి నాయకులు తుగ్గలి నాగేంద్ర, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు అ శోక్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తెలుగు పురుషోత్తం రెడ్డి, న్యాయవాది కప్పట్రాళ్ల రామచంద్ర నాయుడు, కోడుమూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు జయన్న, హెచ్ డిసి డైరెక్టర్ రామాంజనేయులు, కర్నూలు మండల కన్వీనర్ బుర్ర వెంకటేశ్, ప్రకాష్ రెడ్డి, ఫక్రుద్దీన్, నాగరాజు, మాజీ జడ్‌పిటిసి తిమ్మప్ప, నాగమధు, చంద్రశేఖర్, చందు, ఎంపిటిసి మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

**రాజ వర్ధన్ కు ఘన నివాళి**

కర్నూలు మాజీ ఎంపిపి డి.రాజా వర్ధన్ రెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా విష్ణుసేన ఆధ్వర్యంలో కర్నూలు మండల పరిధిలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించి పలుసేవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్వగ్రామం పసుపుల గ్రామంలో తన తల్లి గ్రామ సర్పంచి శీలమ్మ పేదలకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దిన్నెదేవరపాడు సర్పంచి మాధవస్వామి, టిడిపి నాయకులు బి.వెంకట్రాముడు, బి.శ్రీనివాసులు, యువ నాయకులు బి.నారాయణ, మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.సి.బెళగల్, కోడుమూరులో రాజవర్ధన్‌రెడ్డికి నివాళ్లు అర్పించారు.

పస్పలలో పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, సర్పంచి శీలమ్మ

సి బెళగల్‌లో రాజవర్ధన్‌రెడ్డికి నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నాయకులు , కార్యకర్తలు

సమావేశంలో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర కార్యదర్శి కె.మురళీధర్

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

**జెవివి రాష్ట్ర కార్యదర్శి కె.మురళీధర్**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

నేటి యువతరానికి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక ( జెవివి) రాష్ట్ర కార్యదర్శి కె. మురళీధర్ అన్నారు. ఆదివారం కర్నూలు కార్మికకర్షక భవన్‌లో జెవివి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు బిడి. సుధీర్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కె. మురళీధర్ మాట్లాడుతూ జెవివి ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులను నిర్వహించాలని సూచించారు. ఈ క్యాంపులో ప్రధానంగా మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలపై ఉన్న అపోహలన తొలగింప చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాజా మాట్లాడుతూ మే 11న డోన్ లో జరిగే శాస్త్రీయ దృక్పథం అంశంపై నిర్వహించే క్లాసులకు జెవివి నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. జిల్లా సీనియర్ నాయకులు డాక్టర్ బడే సాహెబ్ ,సమతా కన్వీనర్ రమాదేవి, కోడుమూరు నాయకులు అల్తాఫ్, చంద్రశేఖర అజాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యంతో ముందుకు సాగాలి

**ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**

**ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్**



శిక్షణపొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రతి విద్యార్థి ఉన్న అవకాశాలను సద్వినియోగంచేసుకుని నైపుణ్యంతో ముందుకు సాగా లని ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పేర్కొన్నారు. ఆది వారం క్లస్టర్ యూనివర్సిటీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో తిహాన్ ఫౌండేషన్ ఐఐటి హైదరాబాద్ వారి సహకారంతో ట్రిపుల్‌ఐటి డిఎం ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్- డ్రోన్స్" శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, రిజిస్ట్రా ర్ కట్ట వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రతి ఒక్క పనికి డ్రోన్ తోనే ఉపయోగం ఉంటుందని, డ్రోన్ టెక్నాలజీ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులైన పిచికారి, తదితర పనులను డ్రోన్ సాయంతో చేస్తున్నారన్నారు. ఓర్వకల్లులో ఉన్న ఎయిర్ పోర్టు రన్వేను డ్రోన్ టెస్టింగ్ కోసం వాడే అవకాశం ఉందన్నారు. ఈ కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి , ట్రిబుల్ ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ నాయక్, డ్రోన్ కెమెరా కన్వీనర్ డాక్టర్ పద్మావతి, డీన్ అక్తర్ బాను, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్స్ సిహెచ్ సరస్వతి, జి.విజయలక్ష్మి, మొహమ్మద్ వాయిజ్, కె. లక్ష్మణ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ అంతరాయంతో
## రెండు రోజులుగా ప్రజల ఇబ్బందులు

**ప్రజాశక్తి - నందవరం**

నందవరం గ్రామంలో గత రెండు రోజులుగా విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బందులు గురయ్యారు. శనివారం సాయంత్రం విద్యుత్ స్తంభాన్ని వాహనం ఢీకొనడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు శనివారం రాత్రి అంతా శ్రమించి 11 గంటల సమయానికి ప్రజలకు విద్యుత్‌ను అందించారు. విద్యుత్ అంతరాయంతో చిన్నపిల్లలు, ప్రజలు నిద్రలేక అవస్థలు పడ్డారు. విద్యుత్ అధికారులు ఆదివారం ఉదయం విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు. రాత్రి, పగలు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నానికి విద్యుత్ అధికారులు శ్రమించి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందించారు. ఆ సంతోషం ప్రజలకు కొన్ని గంటలూ కూడా లేకుండా పోయింది. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచి నందవరం గ్రామం అంధకారంలోకి వెళ్లిపోయింది. రెండు రోజులుగా విద్యుత్ అంతరాయంతో ప్రజలు నిద్రలేక ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో చాలా పెళ్లిళ్లు జరిగాయి. పెళ్లిళ్లకు వచ్చిన బంధువుల బాధ వర్ణణాతీతం. చీకటిలో ఎటు వెళ్లాలో తెలియక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం

## కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం
**- సిఐటియు మండల కార్యదర్శి రాముడు**

సమావేశంలో మాట్లాడుతున్న రాముడు

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

కార్మిక హక్కుల పరిరక్షణకు ప్రతి కార్మికుడూ నిరంతరం పోరాడాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు కోరారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు 1886లో ప్రాణాలకు తెగించి 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు 8 గంటల పని విధానం ప్రతి కార్మికుడూ హక్కుగా సాధించారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కుల కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల 8 గంటల పని విధానాన్ని రద్దు చేస్తోందని విమర్శించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ప్రేమ్‌కుమార్, వెంకటేశులు, నరసింహులు, సిఐటియు నాయకులు వెంకటేశ్వర శెట్టి పాల్గొన్నారు.

## పి-4 ద్వారా విద్యార్థికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - కౌతాళం**

సమాజంలో పేదలు కూడా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సహాయం చేస్తున్నామని తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదిగి సమాన అవకాశాలు పొందే విధంగా పి-4ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రయివేట్, ప్రజల భాగ్యస్వామ్యంతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకం అమలు చేస్తున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పి-4 విధానం ద్వారా కౌతాళం మండలానికి చెందిన ఉమాశంకర్ కుమారుడు వంశీ అనే బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థికి టిడిపి సీనియర్ నాయకులు, మండల కన్వీనర్ చూడి ఉల్లిగయ్య, టిడిపి మండల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

# ఉన్నత విద్యకు మారుతి నాయుడు చేయూత

**ప్రజాశక్తి - ఆదోని**

ప్రతిభ చూపిన పేద విద్యార్థి రాఘవేంద్ర ఉన్నత విద్యకు కావాల్సిన ఆర్థిక సహాయం అందిస్తామని టిడిపి యువ నాయకులు మారుతి నాయుడు హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన కార్యాలయంలో టిడిపి యువ నాయకులు భూపాల్ చౌదరి సమక్షంలో టాపర్ రాఘవేంద్రను పూలమాల, శాలువాతో సన్మానించి అభినందించా రు. ఈ సందర్భంగా మారుతి నాయుడు మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతూ ఎంతోమంది పేద విద్యార్థులు ప్రతిభ చూపి ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యనభ్యసించలేని పరిస్థితి ఉందన్నారు. అలాంటి వారికి చేయూత అందిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవలే కొందరికి సహాయం మందిస్తూ ఆదర్శంగా నిర్మించాలని, ఆయన అడుగుజాడల్లో పయనిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. దళిత కుటుంబంలో జన్మించి ఇంటర్ ఒకేషనల్ కోర్సులో 958 మార్కులు సాధించి స్టేట్ 1వ ర్యాంకు సాధించిన నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర ప్రతిభ ఆదర్శప్రాయమని చెప్పారు. యువ నాయకుడు భూపాల్ చౌదరి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అడుగు జాడల్లో నడుస్తూ 'టీమ సిఎంఎన్' పేరిట ఆదోని నియోజకవర్గంలో ఇప్పటికే పేదలకు సేవలు అందిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం పట్ల మనస్ఫూర్తిగా మారుతి నాయుడును అభినందిస్తున్నామన్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి పేద విద్యార్థులకు, పేదలకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, టిడిపి నాగనాథనహళ్లి గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, రామకృష్ణ, నరసప్ప, రాఘవేంద్రరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మంజునాథ్ గౌడ్, విద్యార్థి రాఘవేంద్ర కుటుంబ సభ్యులు ఉన్నారు.

టాపర్ విద్యార్థిని అభినందిస్తున్న భూపాల్ చౌదరి, మారుతి నాయుడు

## పిడుగుపాటుతో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - చిప్పగిరి**

చిప్పగిరిలో పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. చిప్పగిరి గ్రామస్తుల వివరాల మేరకు... చిప్పగిరిలోని నూతన గ్రంథాలయం వెనుక భాగాన ఉల్లిగమ్మ దేవాలయం పక్కన చెట్టు కింద ఉన్న పశువుల పాకలో పశు వులకు మేత వేయడానికి పోయిన రిటైర్డ్ ఉద్యోగి శివన్న చెట్టు మీద పిడుగుపడటంతో చెట్టు విరిగి ఆ వ్యక్తిపైన పడింది. ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు శివన్నకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు.

## దేవరగట్టు భక్తిశ్రద్ధలతో పూజలు

**ప్రజాశక్తి - హోళగుంద**

మండలంలోని నెరనికి, నేరనికి తండా, కొత్తపేట, దేవరగట్టు కొండ గుహలో వెలసిన శ్రీమాల మల్లేశ్వర సన్నిధిలో ఆదివారం సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూ కట్టారు. శ్రీమాల మల్లేశ్వరులకు అభిషేకం, బిల్వార్చన, బండార్చన, ప్రత్యేక పూజలు అర్చకులు పంపా స్వామి, మహేష్ నిర్వహించారు. కర్ణాటకకు చెందిన భక్తులు మేళతాళాలతో గిరి పైకెక్కి పూజలు నిర్వహించారు. భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## గాలివాన బీభత్సం
**- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా**

**ప్రజాశక్తి- దేవనకొండ**

దేవనకొండతో పాటు కుంకనూరు, గద్దరాళ్ల, పల్లెదొడ్డి, వెలమకూరు, పొట్లపాడు, అలారుదిన్నె, కొత్తపేట గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకానికి వాన పడడంతో కొంత ఉపశమనం కలిగింది. రబీ సీజన్‌లో రైతులు పొలాల్లో ఆరబెట్టుకున్న ఉల్లి, మొక్కజొన్న పంటలు తడిసిపోయాయి. వర్షంతో రైతులు కొంత ఇబ్బందులకు గురయ్యారు.

## వివాహ, పుట్టినరోజు వేడుకలకు ప్రదీప్ రెడ్డి హాజరు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి వివాహ, పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివారం స్థానిక శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద ఉన్న ఎస్ఆర్ హోం స్టే నిర్వాహకులు శ్రీనాథ్ రెడ్డి కుమారుడు మౌనిక్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. చిలుకలడోణ దామోదర రెడ్డి, ఆయన కుమారుడు రఘునాథ్ రెడ్డి ఆహ్వానం మేరకు పుట్టినరోజు వేడుక లకు హాజరయిన ఆయనను శాలువాతో సన్మానించా రు. అనంతరం స్థానిక సంత మార్కెట్ వద్ద ముస్లిం, మైనార్టీ నాయకులు మహబూబ్ బాష వారి నిఖా కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల ఉపాధ్యక్షులు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకులు లక్ష్మి నారాయణ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు కురువ మల్లికార్జున, ఆర్ఎంపి వైద్యులు భాస్కర్, మైనార్టీ నాయకులు సాబ్‌జాన్, గాజుల బాష, రహీం తుల్లా, మహ్మద్ రఫీక్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడలకు క్రీడాకారిణులు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

జాతీయస్థాయి రగ్బీ క్రీడలకు నలుగురు క్రీడాకారిణులు ఎంపికైనట్లు రగ్బీ క్రీడా సంఘం కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఈనెల 23, 24న అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరిగే జాతీయస్థాయి సీనియర్ మహిళ పోటీలకు జిల్లా నుంచి వెళ్లినట్లు పేర్కొన్నారు. గౌహతి వెళ్తున్న క్రీడాకారులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

## ఫయాజ్ మృతి బాధాకరం
**- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి**

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలోని ముస్లిం నాయకులు, వ్యాపార వేత్త ఫయాజ్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఫయాజ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫయాజ్ తనకు మంచి మిత్రుడని, ఫయాజ్ మృతి చెందడం బాధాకరమని తెలిపారు.

నివాళులర్పిస్తున్న సాయి ప్రసాద్ రెడ్డి

## ఘనంగా ఈస్టర్ వేడుకలు

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోనిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం పట్టణంలోని క్రైస్తవ మందిరాల్లో ఈస్టర్ పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎస్‌కెడి కాలనీ హోలీ ట్రినిటీ చర్చిలో ఆ సంఘ పాస్టర్ రెవరెండ్ భరత్ ఆధ్వర్యంలో, సియోను ప్రార్థన మందిరంలో దైవ సేవకుడు సహోదరుడు ఆకెపోగు తిమోతి, మండగిరి కాథోలిక చర్చిలో రెవరెండ్ ఫాదర్ కోలా విజయరాజు, రాయ నగర్ ఎంబి చర్చిలో ఎంఎస్.రావు ఆధ్వర్యంలో పునరుత్థాన దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సిఎస్ఐ క్రైస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ విలియం సుజిత్ పాల్గొన్నారు. **కోసిగి** మండలంలోని అన్ని గ్రామాల్లోనూ క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. మండలంలోని చింతకుంట, పల్లెపాడు, దొడ్డి బెళగల్, బోంపల్లి, ఐరన్ గల్, సాతనూర్, కందుకూరు, కమలదొడ్డి, జుమ్మలదిన్నె, వందగల్లు తదితర గ్రామాల్లో క్రైస్తవులందరూ ఘనంగా ఈస్టర్ వేడుకలు నిర్వహించి, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిఎస్ఐ, రోమన్ క్యాథలిక్, ఏసు కృపా ప్రార్థన మందిరం వంటి చర్చిల పాస్టర్లు రాజారత్నం, ప్రేమ్‌కుమార్, దేవపుత్ర, ఫాదర్ జాకోబు, టోనీ, శీను, చిదానంద, శాంతమూర్తిలు తమ తమ చర్చిల్లో వాక్యాన్ని బోధిస్తూ ఏసుక్రీస్తు సజీవుడుగా సేవ చేసిన దినాల్లో చెప్పినట్లుగానే, ఆయన మరణాన్ని జయించి పునరుత్థానుడయ్యాడన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న పాస్టర్

కోసిగిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

## ప్రమాదకరంగా కల్వర్టు...
**- మరమ్మతులు చేయాలని కౌన్సిలర్ విజ్ఞప్తి**

**ప్రజాశక్తి - ఆదోని**

సమస్యను తెలుసుకుంటున్న ఇంతియాజ్

పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీ రహదారి కల్వర్టు దెబ్బ తినడం వల్ల రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉందని, మరమ్మతులు చేయించాలని కోరినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ మండిపడ్డారు. ఆదివారం ప్రమాదకరంగా ఉన్న కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజాముద్దీన్ కాలనీ పరిధిలోని ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతినిందని, గమనించకుండా అటుగా వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోయారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని తెలిపారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహించి మరింత ప్రమాదకరంగా మారుతోందని చెప్పారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని సంబంధిత అధికారులు స్పందించి, కల్వర్టుకు మరమ్మతు చేయించి, సమస్య పరిష్కరించాలని కోరారు. ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తీసుకొని, ఈ సమస్యపై అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పరిష్కరించాలని కోరారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్ ఘటన స్థలానికి వెళ్లి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### సొంత డబ్బుతో
## తారు రోడ్డుకు మరమ్మతులు

**ప్రజాశక్తి - ఆస్పరి**

మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

మండలంలోని చిగిలి గ్రామానికి వెళ్లే గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేయించారు. సర్పంచి జయమ్మ, ఎంపిటిసి రాధాకృష్ణ స్పందించి రూ.2 లక్షలు ఖర్చు చేసి సొంతంగా తారు రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. గత 15 ఏళ్ల క్రితం పత్తికొండ, ఆదోని మెయిన్ రోడ్డు నుంచి చిగిలికి వెళ్లే 1.5 కిలోమీటరు తారు రోడ్డు వేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా రోడ్డు పూర్తిగా గుంతలు పడడంతో ప్రజల, ద్విచక్ర వాహన దారులు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దాదాపు రూ.2 లక్షలతో తారు, కంకరతో ప్యాచ్ వర్క్ వేయించి రోలర్‌తో తిప్పించామని చెప్పారు. తమ గ్రామం నుంచి పనుల నిమిత్తం వేరే ఊరికి ఎక్కడికైనా వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉండేదన్నారు. ఈనెల 22, 23న శ్రీకట్టెల తిప్పన తాత జాతర కార్యక్రమం ఉందని, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున వస్తారని తెలిపారు. వారు ఎలాంటి ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ ప్రజా ప్రతినిధిగా తమపై ఉందని చెప్పారు.

## జేఈఈ మెయిన్స్‌లో 'వైష్ణవి' ప్రతిభ

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

జేఈఈ మెయిన్స్ -2025 ప్రవేశ పరీక్షలో ఎమ్మిగనూరు వైష్ణవి అకాడమీ విద్యార్థులు ప్రతిభను చాటారు. జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలు ర్యాంకు సాధించిన విద్యార్థులను వైష్ణవి అకాడమీ ఛైర్మన్ జి.విష్ణు ప్రభు, వైష్ణవి కళాశాలల ఛైర్మన్ జేడి లింగప్ప, వైష్ణవి కళాశాలల కరస్పాండెంట్ సత్యశ్రీ ఆదివారం అభినందించారు. బి.కృష్ణ చైతన్య 92.54, బి.గణేష్ నాయుడు 92.26, సి.విగ్నేష్ 88.22, జి.అజయ్ కుమార్ 87.63, ఎం.పవిత్ర 86.45, జి.జ్ఞాన ప్రసన్న 84.04, ఎం.భరత్ 82.89, టి.గ్రేష్మ 73.50 మార్కులతో ర్యాంకులు సాధించారు. భవిష్యత్తులో తమ అకాడమీ విద్యార్థులకు మరిన్నీ ర్యాంకులు సాధించడానికి కృషి చేస్తామని యాజమాన్యం తెలిపింది.

# బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

**- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు**
**- 75 కిలోల భారీ కేక్ కట్ చేసి, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు వేడుకలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో 75 కిలోల భారీ కేక్‌ను టిడిపి నాయకులు, కార్యకర్తల మధ్యన కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వయస్సులోనూ ముఖ్యమంత్రిగా చురుకుగా ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ, అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. టిడిపి నాయకులు బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, రంగస్వామి గౌడ్, నారాయణ రెడ్డి, ఖాసీం వలీ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నాగరాజు, జనసేన నాయకులు, పట్టణ బ్యాంకు డైరెక్టర్ నవీన్ కుమార్, మహిళా నాయకులు విజయలక్ష్మి పాల్గొన్నారు. **మంత్రాలయం**లో ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఇటు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గ్రూపు, అటు రాఘవేంద్ర రెడ్డి గ్రూపు నుంచి ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలతో ఒకరికొకరు తినిపించుకున్నారు. మండలంలోని మాధవరం గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలో యువ నేత రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలతో ఒకరికొకరు తినిపించుకున్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి, రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. తిక్కారెడ్డి గ్రూపు నుంచి క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి, హండే అనుమంతు, చిన్న భీమ, గణేకంటి రఘు, తిక్కస్వామి గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, రాఘవేంద్ర రెడ్డి గ్రూపు నుంచి టిడిపి నాయకులు ఎన్.రఘునాథ్ రెడ్డి, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు సాయిబాబు, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, మాలపల్లి మాజీ సర్పంచి చావిడి వెంకటేష్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, ఎంపిటిసి ఎంబి.వెంకటేష్, పట్టణ ఇన్‌ఛార్జి బి.వరదరాజులు, సూగూరు శేఖర్, నరసింహ, కళశం రాఘవేంద్ర, గోపాల్, లింగన్న పాల్గొన్నారు. **కౌతాళం**లో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను పోటాపోటీగా నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డి గ్రూపు ఒకవైపు, టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి గ్రూపు మరోవైపు వేడుకలు నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య ఆధ్వర్యంలో వెంకటపతి రాజు, సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, సౌద్రి బసవరాజు, రాజానందు, వీరేష్, కార్తికి చంద్ర, రామలింగ, ఉప్పలదొడ్డి మల్లయ్య, కరిబసప్ప గౌడ్, పకీరయ్య, గిరి, మహాదేవ, ఎరిగేరి బసవరాజు ఆధ్వర్యంలో కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. తిక్కారెడ్డి గ్రూపు టిడిపి సీనియర్ నాయకులు చెన్న బసప్ప, శివ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కొట్రేష్ గౌడ్, కురుగోడు, దొడ్డన గౌడ్, వీరేష్, ఈరన్న గౌడ్, రహిమాన్, మంజు ఆధ్వర్యంలో కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. **ఆలూరు**లో ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో తమ నివాసం నుంచి ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి అంబేద్కర్, వాల్మీకి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాన రహదారి గుండా చెక్‌పోస్ట్ నుంచి ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌కు చేరుకొని కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. టిడిపి ఆలూరు మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివ ప్రసాద్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ మాట్లాడారు. దేవనకొండ, చిప్పగిరి మండలాల కన్వీనర్లు విజయభాస్కర్ గౌడ్, షేక్షావలీ, మాజీ జడ్‌పిటిసి ఉచ్చీరప్ప, హోళగుంద శేషగిరి, బిల్లేకల్ వెంకటేష్ మాట్లాడారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కురువ జయరామ్, ఆస్పరి మాజీ ఎంపిపి కృష్ణ యాదవ్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మనేకుర్తి రాజశేఖర్, ప్రవీణ్, వెంకటేష్ చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్, రెహమాన్, మారుతి పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని నిర్మల్ టాకీస్ ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, కురబ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టిడిపి యువ నాయకులు భూపాల్ చౌదరి, మారుతి నాయుడు సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అక్కడి నుంచి మాతా, శిశు ఆస్పత్రి వద్ద చేరుకొని రోగులకు పండ్లు పంపిణీ చేసి చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రి వద్ద ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్ ఉండే ఫ్లెక్సీ ఉండడాన్ని చూసి ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫ్లెక్సీ తొలగించాలని నినాదాలు చేశారు. అలాగే టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. నాయకులు నాగరాజు, మాధవ్, గోపాల్ ఉన్నారు. అలాగే టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి కార్యాలయంలో భారీ కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. నాయకులు సోమశేఖర్ రెడ్డి, ఫక్రుద్దీన్, గోపాల్ రెడ్డి, నాగరాజు, బుద్ధారెడ్డి, షేక్షావలీ ఉన్నారు. **చిప్పగిరి**లోని అంబేద్కర్ సర్కిల్‌లో టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. టిడిపి నాయకులు, ఎన్ఆర్ఇజిఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఏరూరు మీనాక్షి నాయుడు, ఆలూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపిటిసి రజిని, సర్పంచి పురుషోత్తం, పోతురాజు రాముడు, కొండా గోవిందు, బంటనహాల్ సురేష్, జనార్ధన్ స్వామి, బోగేష్, అమరేష్, నాగరాజు, నీటి సంఘం అధ్యక్షులు ధనుంజయ, మాజీ ఎంపిటిసి నరసింహులు, సంగాల చంద్ర, నగరడోన అంజి, రంగన్న, మేకల రామాంజనేయులు పాల్గొన్నారు. **కోసిగి**లోని స్టేట్ బ్యాంకు దగ్గర భారీ కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు పంపాపతి అధ్యక్షత వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి తెలిపారు. తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరద్వాజ్ శెట్టి, రవితేజ శెట్టి, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ, సీనియర్ నాయకులు నాడిగేని వీరారెడ్డి, నర్సారెడ్డి, డీలర్ నరసన్న, వడ్డే రామయ్య, ఎంపిటిసి రాజు, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సల్మాన్ రాజు, దాదా ఉసేని పాల్గొన్నారు. **ఆస్పరి**లోని టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. టిడిపి నాయకులు బాబు, ఎంపిటిసి రహీంతుల్లా, మాజీ ఎంపిటిసి శివకుమార్, యుగంధర్, సతీష్ కుమార్, రాజ్‌కుమార్, మహేష్, రంగనాథ్, మారేష్, టిడిపి సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, నాగేంద్ర, మల్లి స్వామి, యువరాజు పాల్గొన్నారు. అలాగే ఆస్పరిలోని అంబేద్కర్ సర్కిల్‌లో టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ, సీనియర్ నాయకులు వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, బిఎస్ఎన్ఎల్ టిఎసి మెంబర్ జీవన్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. తెలుగు యువత అధ్యక్షులు రాఘవేంద్ర, నాయకులు కృష్ణ, మల్లి, సోమలింగ, శీను, సుదర్శన్, ఆచారి పాల్గొన్నారు. **హోళగుంద**లో టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, సీనియర్ నాయకులు ఈడిగ గోవిందులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. టిడిపి నాయకులు పంపాపతి, తోక వెంకటేష్, వీరన్న గౌడ్, ఎర్రిస్వామి, కొరివి సాయి బేస్, బుద్ధి వెంకటేష్ పాల్గొన్నారు. **హాలహర్వి**లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ మల్లప్ప, మాజీ ఎంపిటిసి ఉమాకాంత్ స్వామి, సర్పంచి మల్లికార్జున పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఆదోనిలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ఆలూరులో...


మంత్రాలయంలో కేక్ కట్ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

కౌతాళంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


కౌతాళంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

మంత్రాలయంలో కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసులురెడ్డి

కోసిగిలో...

చిప్పగిరిలో

ఆస్పరిలో...

హోళగుంద

హాలహర్వి

**ADONI MUNICIPALITY**

**e-Procurement Tender Notice**

**Roc.No.04/2025-26-E1** **Dated : 21-04-2025.**

invites Tender Notice under 15th FC 2022-23 & 2023-24 Funds and General Funds

Down loading Start date and Time : 21.04.2025 @ 10.00 AM

Down loading End date and Time : 08.05.2025 @ 3.00 PM

For further details the tenderer may visit e-procurement platform on **www.tender.apeprocurement.gov.in.**

or Cell No.98499 05859

**Commissioner,**
**Adoni Municipality.**